నమస్తే తెలంగాణ
మెదక్
I హైదరాబాద్, శుక్రవారం 15 నవంబర్ 2024 MEDAK

సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

- రైతుభరోసా సాయం ఎగ్గొట్టిన సీఎం రేవంత్
- వడ్లు కొనరు కాని.. లిక్కర్ విక్రయాలకు టార్గెట్ పెడతరు
- రుణమాఫీ కాక రైతులు ఇబ్బంది పడుతున్నరు..
- సర్కారు అసమర్ధ విధానాలతో కుప్పకూలిన రియల్ ఎస్టేట్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దన్నపేటలో వడ్ల కొనుగోలు కేంద్రం సందర్శన

నంగునూరు, నవంబర్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని.. ప్రభుత్వ తీరుతో పత్తి, వడ్లు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని సిద్దన్నపేటలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం, రైస్‌మిల్లులు అలాట్‌మెంట్ ఆలస్యం చేయడం, డబ్బులు ఆలస్యంగా ఇవ్వడం కారణంగా సగానికి సగం ధాన్యం రైతులు దళారులకు అమ్మి నష్టపోయారన్నారు. క్వింటాలుకు రూ.2300 మద్దతు ధర ఉంటే.. రైతులు రూ.1900 కే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. రూ.500 బోనస్ బోగస్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వానకాలం రైతుబంధు వేయలేదని.. కేసీఆర్ హయాంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా రైతులకు పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వడ్లు కొనుగోలు చేయకపోతే అధికారులను ఎవరినీ అడగట్లేదని, కానీ.. మద్యం అమ్మకాలు చేయకపోతే ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐలను ట్రాన్స్‌ఫర్ చేశాడన్నారు. తెలంగాణను రేవంత్‌రెడ్డి తాగుబోతులను చేయాలనుకుంటున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. రైతులకు ప్రాధాన్యత ఇవ్వట్లేదు కానీ.. ప్రజలకు మద్యం తాగించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాడని విమర్శించారు. యాసంగికి ముందే రైతులకు రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాకముందు సిద్దిపేట జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఇక్కడ రైతులు పంటలు పండించే వారని.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారన్నారు. కేసీఆర్ సీఎం కాకముందు సిద్దిపేట జిల్లాలో రూ.5 లక్షలకు ఎకరం ధర ఉంటుండే.. భూములకు విలువ లేకుండే అని.. కానీ, కేసీఆర్ సీఎం అయ్యాక ఎకరం భూమి రూ.50 లక్షలకు విలువ పెరిగిందన్నారు. కాంగ్రెస్ వచ్చాక భూముల విలువ తగ్గి, రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వడ్ల కొనుగోలు చేసి, రైతులకు మద్దతు ధర చెల్లించాలని హరీశ్‌రావు కోరారు.

పలు కుటుంబాలకు పరామర్శ

నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. మగ్ధూంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పాకాల కనకయ్య, రాములు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను హరీశ్‌రావు పరామర్శించారు. అంక్షాపూర్‌కు చెందిన జర్నలిస్ట్ నరోత్తమ్‌రెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు. నంగునూరు మండల కేంద్రంలో పురోహితుడు సాయినాథ్‌శర్మ నానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని, మండల పరిధిలోని సిద్దన్నపేటలో ఏఈఓ శిరీష తండ్రి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు.

సాగర్ మృతి కలిచివేసింది
– మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నారాయణరావుపేట, నవంబర్ 14: జక్కాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కొంపెల్లి సాగర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వారి కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే తిరిగిరాని లోకానికి వెళ్లిన సాగర్ మృతి ఎంతో కలిచి వేసిందన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, ఆదుకుంటానని భరోసానిచ్చారు. చింతమడక మాజీ ఎంపీటీసీ దేవేందర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు.

అంక్షాపూర్‌లో నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- అమీన్‌పూర్‌లో బాధితుల ఆధ్వర్యంలో ధర్నా
- మున్సిపల్ ఆర్వోకు మెమోరాండం

అమీన్‌పూర్, నవంబర్ 14: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద చెరువు కట్టపై ముంపు బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 5000 ప్లాట్లు 20 లేఅవుట్లు 40 ఏండ్ల క్రితం క్లియర్ పట్టాలో ఉన్నాయన్నారు. కొంతకాలం తర్వాత మా ప్లాట్లన్నీ మురుగునీటితో నిండిపోయాయన్నారు. ఇందులో ఇరిగేషన్ అధికారుల అలసత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మా ప్లాట్లలో ఉన్న నీటిని తొలిగించి, ఇంటి నిర్మాణాలకు సహకరించాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి ఆర్వో మధుసూదన్‌రెడ్డికి మెమోరాండం అందచేశారు. 15 రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సైతం కలిసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ముంపు బాధితులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ ఆర్వోకు మెమోరాండం అందజేస్తున్న ముంపు బాధితుల జేఏసీ నాయకులు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నారాయణఖేడ్, నవంబర్ 14: నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహంలో ఉంటున్న ఇంటర్ రెండో సంవత్సర విద్యార్థిని మాధవి గురువారం హాస్టల్ భవనం మొదటి అంతస్తుపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో బాలికను హుటాహుటిన నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి సర్కార్ దవాఖానకు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం జూకల్ గ్రామానికి చెందిన మాధవి నారాయణఖేడ్‌లోని హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. దసరా సెలవుల నేపథ్యంలో ఇంటికి వెళ్లి తిరిగి గత మంగళవారం హాస్టల్‌కు వచ్చి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాలిక నడుముకు బలమైన గాయం కావడంతో లేవలేని స్థితిలో ఉంది. ఈ ఘటనపై హాస్టల్ వార్డెన్ రజితను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. ఇంటి నుంచి మంగళవారం హాస్టల్‌కు వచ్చిన విద్యార్థిని మరుసటి రోజు కనిపించకుండా పోయిందని, బాలిక కోసం ఆరా తీస్తున్న క్రమంలోనే బీదర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు అక్కడి పోలీసులు సమాచారం ఇవ్వడంతో తాము రాత్రి అక్కడికి వెళ్లి బాలికను తీసుకువచ్చినట్లు తెలిపారు. బాలిక తరచూ మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నదని, ఆ కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటుందని కుటుంబీకులు చెప్పినట్లు వార్డెన్ పేర్కొన్నారు. మరోవైపు తనను ఎవరో కిడ్నాప్ చేసి పటాన్‌చెరు అక్కడి నుంచి బీదర్ తీసుకెళ్లారని, తాను తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నానని విద్యార్థిని చెప్పడం గమనార్హం.

నారాయణఖేడ్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

పారిశుధ్య పనులు ప్రారంభం

నాగల్‌గిద్ద, నవంబర్ 14: మండలంలోని మోర్గి ఆదర్శ పాఠశాల వసతి గృహంలోని విద్యార్థులు సమస్యలతో అవస్థలు పడుతున్నా.. ఎవరు పట్టించుకోకపోవడంతో ఈ నెల 13న నమస్తే తెలంగాణలో ' పేరుకే ఆదర్శం... పారిశుధ్యం అస్తవ్యస్తం' పేరుతో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు పాఠశాల వసతి గృహంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులపై కూడా దృష్టి సారించి చర్యలు చేపడుతామన్నారు.

మోర్గి పాఠశాలలో చేపట్టిన పారిశుధ్య పనులు

- ఇటీవల చౌటపల్లి స్టేజీ వద్ద భూములు పరిశీలించిన మంత్రి పొన్నం
- భూములు ఇవ్వడానికి ససేమిరా అంటున్న రైతులు
- సర్వేను అడ్డుకున్న రైతులు
- అంతర్గతంగా నివేదికలు తయారు చేస్తున్న రెవెన్యూ అధికారులు
- అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్న రైతులు

ఇండస్ట్రియల్ పార్కు వద్దే వద్దు!

హుస్నాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అడుగులు

అక్కన్నపేట: సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకోవడంతో కూర్చున్న ఆర్ఐ, ఇతర అధికారులు, సిబ్బంది(ఫైల్); ఇండస్ట్రియల్ పార్కుకు ప్రతిపాదించిన స్థలం

అక్కన్నపేట, నవంబర్ 14: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం చౌటపల్లి స్టేజీ వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. బంగారు పంటలు పండే తమ భూములు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఇచ్చేది లేదని రైతులు ఖరాఖండీగా చెబుతున్నారు. ఈనెల 7న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మరుసటి రోజు నుంచి 312 సర్వేనంబర్‌లోని సుమారు 140 మంది రైతులు ఆందోళనలకు దిగారు. హుస్నాబాద్ డివిజన్ కార్యాలయం, అక్కన్నపేట తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను సర్వే చేయకుండా రైతులు అడ్డుకున్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చౌటపల్లికి పరామర్శకు రాగా, బాధిత రైతులు ఆయనను కలిసి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని, ఈ విషయంలో తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేసి వినతి పత్రం అందజేశారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు తాము భూములు ఇవ్వమని ఇటీవల కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను రైతులు, అఖిలపక్ష నాయకులు కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అంతర్గతంగా నివేదిక తయారుచేస్తున్న అధికారులు

హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా వ్యవహరిస్తున్న పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అవసరమయ్యే భూసేకరణపై దృష్టిసారించారు. దీనికోసం అంతర్గతంగా నివేదికను తయారు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా చౌటపల్లిలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 312లో 85.13 ఎకరాలను గుర్తించారు. జనగామ శివారు పట్టా భూములు సర్వే నంబర్ 73, 74, 75, 76, 77, 78, 79, 812, 813, 814, 815లో 23 ఎకరాలు, తోటపల్లి శివారులోని సర్వే నంబర్ పట్టాభూములు 478, 479, 480తో పాటు కొంత ప్రభుత్వ భూమి 20 ఎకరాల వరకు, మొత్తంగా ఇండస్ట్రియల్ పార్కు కోసం 128.38 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకు సంబంధించిన హద్దులు, మ్యాపులు, నివేదికలు, ఇతరత్రా వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేస్తున్నారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి, జనగామ, హుస్నాబాద్ మండలం తోటపల్లి సరిహద్దులను కలుపుతూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం చౌటపల్లిలోని వేంకుంటలో కొంత భాగం పూడ్చివేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రోడ్డు వైపున నిర్మాణం చేసిన పెద్దమ్మతల్లి దేవాలయం, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణం, రోడ్లు, మంచినీటి బావి, చిరు దుకాణాలు తొలిగించాల్సి వస్తుంది.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన రైతులు

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులు, గ్రామ అఖిల పక్ష నాయకులు ఇటీవల హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. చౌటపల్లి స్టేజీ వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయవద్దని కోరారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ సర్ది చెప్పినట్లు తెలిసింది.

తాతముత్తాల నుంచి సాగు చేస్తున్నం...

తాత్తముత్తాల నుంచి ఇక్కడ భూమిని సాగు చేసుకుంటున్నాం. ఎనుకట ఈ ఎకరం ప్రభుత్వ భూమి వచ్చింది. ఈ భూమిపై ఆధారపడి బతుకుతున్నం. ఇప్పుడేమో ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటే ప్రాణం పోతున్నది. మొన్న సార్లు సర్వేకు వస్తే బాగా లొల్లి పెట్టినం. మా భూములు మాకే అంటూ సర్వేలేదూ, ఏమి లేదూ పొండి అంటూ వెనక్కి పంపినం. ఇక్కడ సర్కారు పెట్టే కంపెనీలు ఏం వద్దు. మా బతుకులు మేం బతుకుతాం.
– చంచు ముత్తయ్య, రైతు, చౌటపల్లి

వ్యతిరేకంగా పోరాటం చేస్తాం..

గ్రామ సర్వే నంబర్ 312లో మానాన్న లక్ష్మణ్ పేరిట భూమి ఉంది. అప్పుడు అందరికీ లావణీ పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు పేరిట భూములను లాక్కోవడం సరికాదు. ఈ సర్వేనంబర్‌లో 147 మంది రైతులకు ఐదు గుంటల నుంచి ఎకరంన్నర వరకు భూమి ఉంది. అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులందరం కలిసి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతాం.
–చంచు రంజిత్, రైతు, చౌటపల్లి

భూములు గుంజుకుంటే చావే శరణ్యం..

ఏన్నో ఏండ్ల నుంచి భూములను నమ్ముకొని బతుకుతున్నం. ఇప్పుడేమో గీ సర్కారోళ్లు వచ్చి ప్రభుత్వ భూములను ఇండస్ట్రియల్ పార్కు కోసం తీసుకుంటం అంటుండ్రు. సర్వే చేస్తామని చెప్పడంతో ప్రాణాలు పోయినంత పని అయ్యింది. గీ భూములు పోతే మాకు చావే శరణ్యం. అక్కన్నపేట మండల కేంద్రంలో ఎలాంటి అభ్యంతరాలు లేని వంద లాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ ఇండస్ట్రియల్ పెడితే అందరికీ అనుకూలంగా ఉంటది.
–బొడమల్ల సంపత్, రైతు, చౌటపల్లి

ఉలిక్కిపడిన పారిశ్రామికవాడ

- భయాందోళనకు గురైన స్థానికులు

వీరభద్రనగర్ కాలనీలో పట్టపగలు తల్లీకొడుకు దారుణహత్య

ఘటనాస్థలంలో పోలీసులు, గుమిగూడిన జనం

గుమ్మడిదల, నవంబర్ 14: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి పంచాయతీ పరిధిలోని వీరభద్రనగర్ కాలనీ గురువారం ఉలిక్కిపడింది. ఈ కాలనీకి చెందిన సరోజాదేవి (50), అనిల్(30) పట్టపగలు నడిరోడ్డుపై దారుణ హత్యకు గురికావడంతో కాలనీవాసులు భయాందోళన చెందారు. తమ కుమారుడి మరణానికి సరోజాదేవి కుటుంబం కారణమని నాగరాజు అనే వ్యక్తి ఈ హత్యలకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం 10.30 గంటలకు సరోజాదేవి, ఆమె కుమారుడు అనిల్ బైక్ మీద వెళ్తుండగా నాగరాజు తన కారులో వెళ్లి వారి బైక్‌ను అడ్డగించి కత్తితో విచక్షణారహితంగా అనిల్ చాతిలో పొడిచాడు. తల్లి అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆమెను కూడా కత్తితో వెనుకభాగంలో పొడిచాడు. బలమైన గాయాలు కావడంతో తల్లీకొడుకు ఘటనా స్థలంలోనే రక్తమడుగులో ప్రాణాలు వదిలారు. తన కొడుకును చంపినందునే తల్లీకొడుకును చంపానని ఆగ్రహంతో నాగరాజు అరిచాడు. సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఉండడంతో హుటాహుటిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య చేసిన నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటన స్థలానికి సీఐ సుధీర్‌కుమార్,గుమ్మడిదల, జిన్నారం ఎస్సైలు మహేశ్వర్‌రెడ్డి,నాగలక్ష్మి తన సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలు సరోజాదేవి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను నర్సాపూర్ సర్కారు దవాఖానకు తరలించారు. నిందితుడు నాగరాజును కస్టడీలో తీసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.సీఐ సుధీర్‌కుమార్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పద్మవ్యూహ దీపోత్సవాలకు పంచవటీ క్షేత్రం ముస్తాబు

జహీరాబాద్, నవంబర్ 14: రెండో బాసరగా పేరొందిన రాఘవాపూర్ సిద్ధి సరస్వతీ దేవి పంచవటీ క్షేత్రం పద్మవ్యూహ కార్తిక దీపోత్సవాలకు ముస్తాబైంది. క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో శుక్రవారం (నేడు) నిర్వహించే దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. క్షేత్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పవిత్ర మంజీరాలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు గంగమాత, సరస్వతి, సాయిబాబా, జ్యోతిర్లింగాలు, వేంకటేశ్వర స్వామి, సూర్యభగవాన్ ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. కార్తిక మహోత్సవాలను పురస్కరించుకొని క్షేత్రంలో వైదిక రత్న అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్రహోమం, చండీయాగం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చంద్రగ్రహణం

రాఘవాపూర్ సిద్ధి సరస్వతీదేవి పంచవటీ క్షేత్రం

పూర్తయిన తర్వాత పంచవటీ క్షేత్ర ఆవరణలో ఏర్పాటు చేసిన పద్మవ్యూహ కార్తిక దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కార్తిక స్నానాలతో మంచి ఫలితాలు

పద్మవ్యూహ కార్తీక దీపోత్సవంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని రాఘవాపూర్ పంచవటీ క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా తెలిపారు. కార్తికమాసంలో భక్తులు నది స్నానాలు తప్పకుండా చేయాలన్నారు. కార్తీక మాసంలో వచ్చే చంద్రుడికి విశేష గుణముంటుందని, చంద్రబింబం నుంచి పడే కిరణాల్లో అమృతత్వం ఉంటుందన్నారు. మంజీరా నది అమృతం నుంచే ఉద్భవించింది కనుక గరుడగంగగా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్తిక పౌర్ణమి రోజున సూర్యోదయానికి ముందే నదికెళ్లి మూడు సార్లు నీట మునిగి భగవంతుడిని స్మరించుకోవాలన్నారు. పగలంతా ఉపవాస దీక్షలో ఉండి రుద్రాభిషేకం చేయించి శివాలయాల్లో మట్టి ప్రమిదలతో 365 దీపాలను ఆవు నేతితో వెలిగిస్తే సమస్త పాపాలు తొలిగిపోతాయన్నారు. ఈ పద్మవ్యూహ కార్తిక దీపోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయద్రం చేయాలని కాశీనాథ్ బాబా కోరారు.

సీఎం కుటుంబీకుల కోసమే ఫార్మాసిటీ

- గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, నవంబర్ 14: సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడు, అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యుల కోసమే ఫార్మాసిటీ (ఫార్మా విలేజ్)ల ఏర్పాటు చేస్తున్నారని, దీనికోసం బలవంతంగా రైతుల నుంచి భూములు గుంజుకుంటున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి అక్రమ అరెస్టు అప్రజాస్వామికం అన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రెండు రోజులు దీక్ష చేపట్టినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం పోలీసులతో ఆయనను అరెస్టు చేయలేదని, దీక్షకు అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. 80 శాతం మంది రైతుల ఆమోదం ఉంటేనే భూసేకరణ చేయాలని చెప్పిన మాటలు ఆయన మరిచి పోయారన్నారు. ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, గతంలో మాట్లాడిన మాటలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ఫార్మాసిటీకి భూసేకరణ చేసి దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఫార్మా పరిశ్రమలను నిలపాలని సంకల్పించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఒప్పించి 20వేల ఎకరాల భూసేకరణ చేసిందన్నారు. రైతులు, ప్రతిపక్ష నేతలపై అక్రమంగా కేసులు పెట్టి అర్ధరాత్రి రైతులను దౌర్జన్యంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. అక్రమంగా పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పాలనలో కాంగ్రెస్ విఫలం

- మెదక్ ఎంపీ రఘునందన్ ధ్వజం

మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

కంది, నవంబర్ 14: రాష్ట్రంలో ప్రజాపాలన పడకేసిందని, కాంగ్రెస్ సర్కారు అన్నింటా ఘోరంగా విఫలమైందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. గురువారం కందిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయచ్చని, కానీ.. వాటిని ఫార్మా కంపెనీలకు ఎందుకు ఇవ్వలేదని సీఎంను ప్రశ్నించారు. నాడు ఖమ్మం మిర్చి యార్డు, మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం ధర్నా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు అర్ధరాత్రి సమయంలో అరెస్టుల పర్వం కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి

- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

మెదక్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ)/సిద్దిపేట కలెక్టరేట్: జిల్లాల్లో ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడా చిన్న సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో గురువారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విజయవంతంగా ధాన్యం సేకరణ పూర్తిచేయాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్, మిల్లర్ల విషయంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. జిల్లా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, రోజూ సాయంత్రం జిల్లాల్లో జరిగిన కొనుగోలు నివేదికలను పంపించాలన్నారు. దొడ్డు, సన్న వడ్ల కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సన్న వడ్లకు బోనస్ ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 483 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటి వరకు 39 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ తెలిపారు. వీసీలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి, డీసీవో కరుణ, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.50 లక్షల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని అంచనా వేశామని, 419 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1421 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై డీఎం ప్రవీణ్, మార్కెటింగ్ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంజీవని దవాఖానలో గుండె ఆపరేషన్లు

- ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్

సత్యసాయి దవాఖానలో ఎక్విప్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సునీల్ గవాస్కర్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 14